క్లుప్తంగా

అన్నదానం



కడప కోటిరెడ్డి సర్కిల్: కడప నగర శివార్లలోని బందా వృద్ధాశ్రమంలో సోమవారం చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లె గ్రామానికి చెందిన గువ్వలేశ్వరరెడ్డి కుమారుడు జై జీవన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు గువ్వలేశ్వర్ రెడ్డి, ప్రశాంతిలు వృద్ధుల సమక్షంలో కేక్ కటింగ్, అన్న వితరణ కార్యక్రమాలు చేపట్టారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు బాల సుబ్బయ్య, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

12 న సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 12న మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు కడప ఐ.ఎం.ఎ. హాల్లో పార్టీ నేతలతో వివిధ అంశాలపై పీసీసీ అధ్యక్షురాలు సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారని డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీ లో గ్రూపులు రెండు మాత్రమే.. ఒకటి పనిచేసే గ్రూపు, రెండోది పని చేయని గ్రూపు అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కోఆర్డినేటర్లు , నాయకులు హాజరయ్యారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నారాయణ విద్యాసంస్థలలో పుస్తకాలను విక్రయిస్తూ వ్యాపారం చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి అన్నారు. సోమవారం నారాయణ, భాష్యం విద్యాసంస్థల ఎదుట పుస్తకాల విక్రయాల్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగులు లాగా పుట్టుకొస్తున్నాయని తెలిపారు. దోపిడీ పరమావధిగా వీటిని నెలకొల్పుతున్నారని విమర్శించారు. వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి పుస్తకాలు, అధిక ఫీజులు పెంచి విక్రయిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని విద్యాసంస్థల జాబితాను విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, అజయ్, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, కడప నగర కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సంజయ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్ల నిర్వహణపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలలు ప్రారంభం కాకమునుపే అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని, ఆయా పాఠశాలలను విద్యాశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న కోరారు. సోమవారం కడప నగరంలో రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కడప నగరం, బద్వేల్, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లె, పీలేరు నియోజకవర్గ ప్రాంతాల్లోని కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా పెద్ద,పెద్ద హోర్డింగ్స్ వేసి విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకులు రాజు పాల్గొన్నారు.

పది మూల్యాంకన విధుల పారితోషకం చెల్లించాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పరీక్షల మూల్యాంకన విధులకు సంబంధించిన పారితోషికాన్ని వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. ఈ విషయమై సోమవారం సాయంత్రం కడప జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ మార్చి నెలలో జరిగిన పదవ తరగతి పరీక్షల విధులకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ ఆఫీసర్లు పరీక్షల నిర్వహణకు సొంత డబ్బు ఖర్చు పెట్టుకుని విధులు నిర్వహించారన్నారు. ఏప్రిల్ నెలలో జరిగిన పదవ తరగతి మూల్యాంకన పారితోషకం కూడా చెల్లించలేదని, పరీక్షలు ముగిసి ఫలితాలు వెలువడినప్పటికీ పారితోషికం చెల్లించడంలో అలసత్వం వహించడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు వై రవికుమార్, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహమ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహబూబ్ బాషా, అస్లాం బాషా, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.







అధికారులూ.. ఇటు 'కేసీ' చూడండి

ఇక్కడ కనిపిస్తున్న చిత్రాలు కడప పరిధిలోని కేసీ కెనాల్ దుస్థితికి నిదర్శనం. కాలువ పొడవునా పిచ్చి మొక్కలు పెరిగాయి. అక్కడక్కడా చెత్తాచెదారంతో నిండివుంది. ఇది ఖరీఫ్ సీజన్. కాలువ గుండా నీళ్లు ప్రవహించే సమయం. ఇలాంటి తరుణంలో రైతాంగానికి కీలకంగా మారిన కాలువను ఎవరూ పట్టించుకోకపోవడం దారుణం. అధికారులూ కాస్త ఇటు'కేసీ' చూడండని రైతులు కోరుతున్నారు. - ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, కడప

మధ్యాహ్న భోజనం కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో, స్కూళ్లలో మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ లో ఉన్న మెస్ ఛార్జీలు జీతభత్యాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని మెస్ చార్జిలతో ఏజెన్సీలను నడపలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గత సంవత్సరం జూలై నుండి ఇప్పటివరకు మూడుసార్లు మెనూ రాష్ట్ర ప్రభుత్వం మారుస్తూ ఉందన్నారు. దీని వల్ల మధ్యాహ్నం భోజనం కార్మికుల మీద విపరీతమైన భారం పడుతున్నదని, మరికొన్ని చోట్ల తీవ్రమైన రాజకీయ ఒత్తిడిలకు గురిచేస్తూ తొలగింపునకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాగి జావ ప్రవేశపెడుతుందని పెట్టడం మంచిదే కానీ, దీని అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలన్నారు. మెనూ ప్రకారం ప్రతి విద్యార్థికి రూ.20 మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 10 వేలు జీతం పెంచాలని, సబ్సిడీ కింద గ్యాస్ ప్రభుత్వమే ఏజెన్సీలకు సరఫరా చేయాలన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, ఏపీ మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చాంద్ బాషా, నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టండి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవ రెడ్డి కోరారు. ఈ విషయమై సోమవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌కు ఆర్ఎస్‌యు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తూ లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. అలాగే పాఠ్యపుస్తకాలు. బూట్లు, టై, బెల్టు, యూనిఫామ్ పాఠశాలలోనే కొనాల్సిందే అని చెప్పి విద్యార్థి తల్లిదండ్రులను ప్రలోభాలు గురి చేస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్న విద్యాసంస్థలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయకులు గురు, కొండయ్య, జై సింహ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న తహసీల్దార్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని టిడ్కో-2 లేఔట్ జగనన్న కాలనీలో అక్రమ కట్టడాలను తహసీల్దార్ నారాయణరెడ్డి ప్రోత్సహిస్తున్నారని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి ఎం. దేవ ఆరోపించారు. సోమవారం «ప్రజా సమస్యల పరిష్కార వేదిక» కార్యక్రమంలో డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడుకు ఆయన వినతి పత్రం సమర్పించారు. ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వ్యక్తి ఎలాంటి అలాట్‌మెంట్ లేకుండా నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు...సాయమ్మ అనే పేద దళితురాలు బేస్‌మట్టం నిర్మించుకుంటుంటే అడ్డుకుంటున్నారన్నారు. అధికారులు దీనిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నూతన సాంకేతికతతో అధిక దిగుబడి

వల్లూరు : రైతులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం వలన వ్యవసాయంలో మంచి ఫలితాలను సాధించడానికి అవకాశాలు వున్నాయని భారత నూనె గింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కదిరీ వేల్ అన్నారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండల పరిధిలోని తప్పెట్ల, పెద్ద లేబాక గ్రామాలలో సోమవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా మాట్లాడడానికి అవకాశం కల్పించడంతో బాటు, ఖరీఫ్ పంట కాలంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి 700 జిల్లాలలో శాస్త్రవేత్తల బృందాల భాగస్వామ్యంతో నూతన సాంకేతికతను అందించడం, ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఏ వీరయ్య వరిలో నారు నుంచి కోత దాకా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ కే సాయి మహేశ్వరి మినుము,నువ్వుల పంటలలో మేలైన రకాల గురించి, విత్తన శుద్ధి గురించి, ఎరువులు యాజమాన్యం గురించి వివరించారు.

అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారు..?



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు వెంటనే రైతులకు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పైన సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒక సంవత్సరం గడిచిపోతున్న రైతులకు పెట్టుబడి సాయం గా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ రూ.20వేలను ఇంతవరకు ఒక విడత కూడా ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమన్నారు. వెంటనే 20 వేల రూపాయలను ఖరీఫ్ సాగు ఖర్చులకు గాను రైతులకు అందించాలన్నారు. రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులు హంద్రీ - నీవా, గాలేరు - నగరి పూర్తి చేయకుండా, పూర్తయిన ప్రాజెక్టుల కింద పంట కాలువలు నిర్మించకుండా ఎవరిని మోసం చేయడానికి రూ.80 వేల కోట్లకు పైబడి ఖర్చుతో పోలవరం - బనకచర్ల సాగునీటి ప్రాజెక్టును నిర్మింప చేస్తామని చెబుతున్నారన్నారు. సత్వరమే పెండింగ్ ప్రాజెక్టుల, పంట కాలువల నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన నిధులను మంజూరు చేసి పూర్తిచేసి తరువాత పోలవరం - బనకచర్ల లాంటి అధిక భారంతో కూడుకున్న ప్రాజెక్టుల గురించి ఆలోచన చేయాలన్నారు. రాష్ట్రంలో 70 శాతం వ్యవసాయాన్ని కౌలు రైతులే చేస్తున్నారని వారికి ఎటువంటి చట్టాలు లేవని, ప్రభుత్వం ఇప్పటికైనా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బ్యాంకు రుణాలను ఇవ్వాలని, రైతులకు ఇస్తున్న ప్రతి సాయాన్ని కౌలు రైతులకు ఇచ్చినప్పుడే కౌలు రైతులను, వ్యవసాయాన్ని రక్షించుకుంటాం తప్ప మరో విధంగా వ్యవసాయాన్ని రక్షించుకోలేమన్నారు. కౌలు రైతుల రక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలన్నారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై. వి. సుదర్శన్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు టి. మనోహర్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు గోశెట్టి రామ్మూర్తి, సహాయ కార్యదర్శి పి. చంద్రశేఖర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు ఈ. బాల చంద్రయ్య. బి. భీమరాజు, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్: గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్య మెరుగు కోసం పనిచేసే స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్వచ్ఛభారత్ కార్మికుల ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్య మెరుగు కోసం పనిచేసే స్వచ్ఛభారత్ కార్మికులకు నెలకు ఇచ్చే అరకొర రూ.6వేలు జీతం జిల్లాలో కొన్ని పంచాయతీలలో మూడు నెలలు, మరికొన్ని పంచాయతీలలో ఆరు, ఎనిమిది నెలలు మరికొన్ని పంచాయతీలలో సంవత్సరాల తరబడి జీతాలు అందడం లేదని తక్షణమే ఇవ్వాలన్నారు. ఒంటిమిట్ట, వేంపల్లి తదితర మండలాలలో పంచాయతీ నిధులను దొంగ బిల్లులు ద్వారా కాజేసిన అధికారులు దొరికినా చర్యలు తీసుకోవడంలో జిల్లా పంచాయతీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో వీధులను శుభ్రపరుస్తూ మురికి కాలువలను క్లీన్ చేస్తూ ప్రభుత్వ అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు నెలనెలా జీతాలు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పండుగొచ్చిన పబ్బమొచ్చినా, కుటుంబ సభ్యులు వివాహం అయినా చనిపోయినా సెలవులు మాత్రం ఉండవు.. ఆఖరికి కరోనా సమయంలో తమ ప్రాణాలు తెగించి విధులు నిర్వహించిన వీరి జీవితాల్లో మాత్రం వెలుగులు లేవన్నారు. ఇప్పటికి రెండుసార్లు 15 ఫైనాన్స్ నిధులు వచ్చినా స్వచ్ఛ భారత్ కార్మికులకు అరకొర వేతనాలు ఇచ్చారని, కొన్ని గ్రామాలలో స్వచ్ఛభారత్ కార్మికులను తొలగించి వారికి రావలసిన వేతనాల బకాయిలు కూడా ఇవ్వకుండా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే లింగన్న, స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ సహాయ కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షులు, ఆనందయ్య, నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఐ.ఎన్.సుబ్బమ్మ

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రంలో రోజు రోజుకు మహిళలు, విద్యార్థుల పై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని ఐద్వా నాయకులు విమర్శించారు. సోమవారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, విద్యార్థుల పై దాడులు, అత్యాచారాలు అధికం అయ్యాయని అన్నారు. అందుకు సత్యసాయి జిల్లా లో, అనంతపురం సంఘటనలే కారణం అన్నారు. ఈరోజు పాలక ప్రభుత్వాలు మహిళా రక్షణ కోసం మేమున్నామని గొప్పలు చెప్పుకుంటున్నాయని కానీ అది ఆచరణలో సాధ్యం కావడంలేదన్నారు. రాష్ట్రంలో హోం మంత్రి మహిళ అయ్యిండి కూడా దాడులను,అత్యాచారాలను అరికట్టలేక పోయారన్నారు.బలమైన చట్టాలు,శిక్షలు అమలు జరిగినప్పుడే అత్యాచారాలు,దాడులు ఆగుతాయని అన్నారు. అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, నగర కార్యదర్శి విజయ్, ఐద్వా జిల్లా నాయకులు అనంతమ్మ, దుర్గమ్మ పాల్గొన్నారు.

వృద్ధురాలు ఇంటి పన్ను మార్చిన అధికారులను సస్పెండ్ చేయాలి



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

కడప కార్పొరేషన్: నిరుపేద వృద్ధురాలు పిచ్చమ్మ ఇంటిపన్ను మార్పు చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద వారు ధర్నా నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ మాట్లాడుతూ ఇంటి పన్ను మార్పు చేయడం వల్లే అక్రమార్కులు దుర్మార్గంగా ఇంటి కూల్చివేతకు తెగబడ్డారన్నారు. శివానందపురం డోర్ నెంబర్ 86/113 లో నివాసం ఉంటున్న భూమన పిచ్చమ్మ , ఆమె కుమారుడు వెంకటసుబ్బయ్య పేరుపై 2006 సంవత్సరం నుండి పన్నులు చెల్లిస్తున్నారని, 2013 నుంచి 2022 వరకు వెంకటసుబ్బయ్య పేరు పై ఇంటి పన్ను వస్తున్న ఆధారాలున్నాయని, 2022 ఏప్రిల్ ఏడవ తేదీన బాల గురవయ్య పేరుపై అక్రమంగా పన్ను మార్పు చేశారన్నారు. ఇంటి డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేయకుండా అక్రమంగా ఇంటి పన్ను మార్పు చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, యధావిధిగా పిచ్చమ్మ కొడుకు బి.వెంకటసుబ్బయ్య పేరున ఇంటి పన్ను వచ్చే విధంగా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.పి జిల్లా నేత గురప్ప, ఆమ్ ఆద్మీ పార్టీ నేత డాక్టర్ శ్రీనివాసులు, సీపీఐ యం ఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఓబయ్య, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డబ్ల్యూ రాము, లోక్ సత్తా నాయకులు శ్రీక్రిష్ణ, ఆర్‌సీపీ నాయకుడు ప్రసాద్ , ప్రజా సంఘాల నాయకులు ప్రసాద్ , ఆంజనేయులు, గోపాల్, సుబ్రహ్మణ్యం,శివారెడ్డి, అఖిలపక్ష నాయకులు మద్దిలేటి, బ్రహ్మం ,మునెయ్య, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



ఐటీఐ సర్కిల్‌లోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించి 3200 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబుల్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ను ఆపాలని కోరుతూ నగరంలోని ఐటీఐ సర్కిల్ గాంధీ విగ్రహం ఎదుట ఏఐటీయూసీ, సీఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ను ఆపాలని గత మూడు సంవత్సరాల నుంచి అక్కడున్న కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు, నిరాహార దీక్షలు చేశారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రవేట్ పరం ఆపకపోగా అందులో పనిచేస్తున్న దాదాపు 3200 మంది కాంట్రాక్ట్ కార్మికులను అకారణంగా తొలగించారు. వారికి రావలసిన ఎస్ఆర్ పాలసీ గాని కార్మికులకు రావలసిన ఇతర బెనిఫిట్స్ ఏమీ ఇవ్వకుండా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి నాయకులు గతంలో మేము అధికారంలోకి వస్తే విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకుంటామని చెప్పారన్నారు. ఇప్పుడు ఆ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా తొలగించిన కార్మికులను తిరిగి వెంటనే విధుల్లో చేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, జిల్లా డిప్యూటీ సెక్రటరీ కే.సి.బాదుల్లా, సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శి చంద్ర రెడ్డి, వెంకటసుబ్బయ్య, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో యోగాంధ్ర



యోగాసనాల గురించి వివరిస్తున్న మిత్రయోగా అధినేత డాక్టర్ కల్పన

కడప ఎడ్యుకేషన్: డా. వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సోమవారం «యోగాంధ్ర - 2025» కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి. విశ్వనాథ కుమార్ అతిథిగా హాజరై యోగా విశిష్టతను తెలియ చేశారు. యోగా శారీరక, మానసిక, భావోద్వేగ సమతుల్యతకు దోహద పడుతుందన్నారు. మిత్ర యోగా సెంటర్ అధినేత డాక్టర్. కల్పన పాల్గొని యోగాసనాలు, శ్వాస అభ్యాసాలు, దినచర్యలో అమలు చేయదగిన ఆరోగ్య చిట్కాలు వివరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి ఇంటింటి చెత్త సేకరణను సక్రమంగా చేయాలని, పారిశుద్ధ్య సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, సిటీప్లానర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

- కడప నగరంలోని 20వ డివిజన్ పరిధిలో వైఎస్సార్ వాటర్ ప్లాంటు వద్ద రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచి 18 నెలలు కావస్తున్నా ఇంత వరకూ రోడ్డు నిర్మాణం చేయలేదని ఆ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి తెలిపారు. వైఎస్ విజయమ్మ పార్కును అభివృద్ధి చేయాలని, విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నుంచి డ్రైనేజీ కాలువలో పూడిక తీయడానికి టెండర్లు పిలిచి రెండు మాసాలు పూర్తయినా పూడిక తీయలేదన్నారు. రాజీవ్ పార్కు నుంచి సుబ్రమణ్యం సర్కిల్ వరకూ డ్రైనేజీ కాలువలో పూడిక తీయాలని, పాత ఎంప్లాయిమెంట్ కార్యాలయం వద్ద నిర్మిస్తున్న రోడ్డు పూర్తి నాసిరకంగా ఉందని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె. బాబు పాల్గొన్నారు.

1200 పుస్తకాల బహూకరణ



సతీమణితో కలిసి పుస్తకాలను అందజేస్తున్న రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి

కడప కల్చరల్: ప్రముఖ సాహితీ వేత్త అనంతపురం వాసి ఆచార్య రాజపాళెం చంద్రశేఖర్ రెడ్డి సిపి బ్రౌన్ భాష పరిశోధన కేంద్రానికి 1200 పుస్తకాలను అందజేశారు. ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, సలహా మండలి సభ్యులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ఈ పుస్తకాలను సోమవారం అనంతపురం జిల్లాలోని ఎల్.ఐ.సి. కాలనీలోని తమ నివాసగృహంలో అందజేశారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్, బి.హరికృష్ణలకు అందజేశారు. ఈ సందర్భంగా బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులుగా పనిచేసిన ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గతంలో కూడా కొన్ని వందల పుస్తకాలను బ్రౌన్ గ్రంథాలయానికి బహూకరించారన్నారు. ప్రస్తుతం ఆచార్య రాచపాళెం బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో సిద్ధాంతవ్యాసాల సంపుటాలు, చిందోళ్ల చరిత్ర సంస్కృతీ సాహిత్యం , ముళ్లపూడి వెంకటరమణ రచనలు, సమగ్ర పరిశీలన , స్మరనారాయణీయం, 'గుమ్మి', తిరుమల చరిత్ర , అండమాను జైలు, ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు, పాల్కురికి సోమనాథుని కథలు , కూనలమ్మ పదాలు, మరికొన్ని కథ, నవల, కవితా సంపుటాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి, డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన పంటల పరిశీలన

సింహాద్రిపురం : సింహాద్రిపురంతోపాటు గురిజాల, హిమకుంట్ల, లోమడ తదితర గ్రామాలలో ఆదివారం వీచిన ఈదురు గాలుల దాటికి భారీగా అరటి చెట్లు నేలకొరిగాయి. సోమవారం ముద్దనూరు హెచ్‌ఓ మల్లేశ్వర్ రెడ్డి, ఏఓ శివమోహన్‌రెడ్డిలు దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలించారు. సింహాద్రిపురంలో 18హెక్టార్లు, హిమకుంట్లలో 14, గురిజాలలో 12హెక్టార్లు, మొత్తమ్మీద 44హెక్టార్లలో అరటి పంట దెబ్బతిందన్నారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని అధికారులు రైతులకు తెలిపారు. అరటి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.